కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌కు వినతిపత్రం అందజేస్తున్న చిన్నకోడూరు మండల రైతులు

నీటిని విడుదల చేయాలి

సిద్దిపేట అర్బన్, జనవరి 9 : రంగనాయకసాగర్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయాలని చిన్నకోడూరు మండలానికి చెందిన రైతులు మంగళవారం సిద్దిపేట పట్టణంలోని విపంచి కళానిలయంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ సంవత్సరం వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో బోరు బావుల్లో సరైన నీరు లేక ఆరుతడి పంటలతోపాటు వరిపొలాలు పారడం లేదన్నారు. రంగనాయకసాగర్ నుంచి నీటిని విడుదల చేసి తమ పంటలను కాపాడాలని రైతులు విజ్ఞప్తి చేశారు. నీటిని విడుదల చేయకపోతే సాగు నీరు లేకపోవడంతో పంటలు చేతికి వచ్చే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజాశర్మ, ఎంపీపీ మాణిక్యరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వెదసాగుతో అధిక లాభాలు

దామరకుంటలో డ్రమ్ సీడర్ ద్వారా వరిసాగును పరిశీలిస్తున్న డీఏవో శివప్రసాద్

- డీఏవో శివప్రసాద్

మర్కూక్, జనవరి 9: వేదసాగు పద్ధతిలో వరిసాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చని, రైతులకు ఖర్చు కూడా తక్కువ అవుతుందని డీఏవో శివప్రసాద్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దామరకుంటలో డ్రమ్ సీడర్ ద్వారా వరిసాగు చేస్తున్న రైతు గణేశ్ పొలాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 120 ఎకరాల్లో వెదసాగు పద్ధతిలో రైతులు వరిసాగు చేస్తున్నారన్నారు. నారుమడి పద్ధతిలో ఎకరాకు 25 నుంచి 30 కిలోల విత్తనాలు అవసరం ఉంటాయన్నారు. కార్యక్రమంలో అధికారులు నగేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పల్లా పర్యటన

చేర్యాల, జనవరి 9 : జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బుధవారం చేర్యాలలో పర్యటించనున్నారు. మండలంలోని పోతిరెడ్డిపల్లిలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం చేర్యాల పట్టణంలోని ప్రజంటేషన్ పాఠశాలలో నిర్వహించే 25వ వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొననున్నారు. ఎమ్మెల్యే పర్యటనకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రజాభీష్టం మేరకే పనిచేయాలి

మాట్లాడుతున్న జడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజాశర్మ

- కేసీఆర్ ప్రభుత్వ పథకాలు యథావిధిగా కొనసాగించాలి
- రైతుబంధు, రుణమాఫీ వెంటనే పూర్తి చేయాలి
- కేసీఆర్ ప్రభుత్వ పథకాలు కొనసాగించాలని ఏకగ్రీవ తీర్మానం
- రైతుబంధు ఎందుకు ఆలస్యమవుతుందని బీఆర్ఎస్ సభ్యుల ఆగ్రహం
- జడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజాశర్మ
- సిద్దిపేటలో జడ్పీ సర్వసభ్య సమావేశం

సిద్దిపేట అర్బన్, జనవరి 9 : కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు యథావిధిగా అమలు చేయాలని జడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజాశర్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని విపంచి కళానిలయంలో మంగళవారం జడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం జరిగింది. ముందుగా నూతనంగా దుబ్బాక ఎమ్మెల్యేగా ఎన్నికై సర్వసభ్య సమావేశానికి హాజరైన ప్రభాకర్‌రెడ్డిని జడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజాశర్మ, జిల్లా పరిషత్ అధికారులు సన్మానించారు. సమావేశంలో వ్యవసాయం, ఉద్యానవనశాఖ, పశుసంవర్ధకశాఖ, విద్య, వైద్యం ఆరోగ్యం, ఆయుష్, ఎన్ఆర్ఈజీఎస్, బీసీ సంక్షేమం, ఎస్సీ కార్పొరేషన్, పంచాయతీరాజ్, ఇంజినీరింగ్, ఆర్అండ్‌బీ, నేషనల్ హైవేస్, విద్యుత్, స్త్రీ శిశు సంక్షేమం, పౌర సరఫరాలశాఖ వంటి పలు శాఖలపై అధికారులు వారి పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజాభీష్టం మేరకే ప్రభు త్వం పనిచేయాలన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను తప్పకుండా కొనసాగించాలన్నారు. గులాబీ అధినేత కేసీఆర్ ముందు చూపుతో రైతుల కోసం అనేక పథకాలు ప్రవేశ పెట్టారని.. ఇందులో భాగంగా రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలు తీసుకొచ్చారన్నారు. రైతులకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించి జిల్లాలో రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్లు నిర్మించి రైతులకు సాగు నీరు అందించారన్నారు. బీడు బారిన భూములను సస్యశ్యామలంగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన అల్పాహార పథకం, రాగిజావ పంపిణీని కొనసాగించాలన్నారు. రెండేండ్ల నుంచి సిద్దిపేట జిల్లా పదో తరగతి ఫలితాల్లో అగ్రగామిగా నిలుస్తుందని.. ఈ సంవత్సరం కూడా జిల్లా మొదటి స్థానంలో నిలిచేలా కృషిచేయాలన్నారు. దళిత బిడ్డల ఆర్థిక సాధికారత కోసం తీసుకొచ్చిన దళిత బంధు పథకం దేశానికి ఆదర్శంగా నిలిచిందని.. ఈ పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించి.. అర్హులైన లబ్ధిదారులకు యూనిట్లు పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, జడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారులు పాల్గొన్నారు.

జడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎంపీపీలు, జడ్పీటీసీలు

పలు పథకాలపై తీర్మానం చేసిన సర్వసభ్య సమావేశం

కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పలు పథకాలను ఈ ప్రభుత్వం కూడా కొనసాగించాలని జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఇందులో రైతుబంధు, రైతురుణ మాఫీ పథకాలను వెంటనే అమలు చేయడంతో పాటు జిల్లాలోని రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ సభ్యుడు ప్రతిపాదించగా.. సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. గ్రామపంచాయతీల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను యథావిధిగా కొనసాగించాలని మరో బీఆర్ఎస్ సభ్యుడు ప్రతిపాదించగా.. సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. దళితబంధు, గృహలక్ష్మి, రెండో విడత గొర్రెల పంపిణీ పథకాలను యథావిధిగా కొనసాగించి అర్హులైన లబ్ధిదారులకు నిధులు విడుదల చేయాలని బీఆర్ఎస్ సభ్యుడు ప్రతిపాదించగా.. సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

సభ్యుల మధ్య వాగ్వాదం

రైతు బంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కావడం లేదని ఓ సభ్యుడు సభ దృష్టికి తీసుకురాగా.. దానికి కాంగ్రెస్ పార్టీకి చెందిన సభ్యుడు గత ప్రభుత్వం ఫిబ్రవరి వరకు రైతుబంధు వేసిందని చెప్పడంతో.. బీఆర్ఎస్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కో రైతు ఖాతాలో రూ.20, రూ.30 తమ ప్రభుత్వం ఏనాడు వేయలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే డిసెంబర్ 9వ తేదీన రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు ఎందుకు చేయలేదని సభ్యులు ప్రశ్నించారు. దీంతో కాసేపు సభలో వాగ్వాదం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 30 రోజుల్లో ఉచిత బస్సు పథకం తప్ప ఏ హామీని నెరవేర్చలేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని.. రాబోయే రోజుల్లో అవి ఏ విధంగా అమలు చేస్తారో చెప్పాలని సభ్యులు నిలదీశారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

– దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

సిద్దిపేట నుంచి రామాయంపేట మీదుగా నిర్మితమవుతున్న జాతీయ రహదారి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని.. అధికారులపై ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. నూతనంగా నిర్మించిన దుబ్బాక ప్రభుత్వ పాఠశాలను సందర్శించి.. ఎలాంటి సౌకర్యాలు కావాలో సమీక్ష నిర్వహించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. గత ప్రభుత్వంలో మంజూరైన బీసీ బంధు చెక్కులను పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రెండో విడత గొర్ల పంపిణీ కోసం లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారని.. వాటిని త్వరగా పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆయిల్‌పామ్ రైతులకు ఉద్యానవన, వ్యవసాయశాఖ అధికారులు నిరంతరం అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యం రైస్‌మిల్లుల ద్వారా పక్కదారి పట్టకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

'మల్లన్న' ఆదాయం రూ.23,50,333

చేర్యాల, జనవరి 9 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం సందర్భంగా ఆర్జిత సేవల ద్వారా మల్లన్న ఖజానాకు రూ.23,50,333 ఆదాయం వచ్చినట్లు మంగళవారం ఆలయవర్గాలు తెలిపాయి. కల్యాణ మహోత్సవం ప్రారంభం రోజు శనివారం రూ. 1,85,356, ఆదివారం రూ.18, 74, 449, సోమవారం రూ.2,90,528 ఆదాయం బుకింగ్, పులిహోర, లడ్డూ ప్రసాదం విక్రయాలు, దర్శనం టికెట్ల విక్రయం, ఎల్లమ్మ ఆలయం వద్ద మొక్కుల రూపంలో, గదుల కిరాయిలు, అన్నదానంలో దాతల విరాళం, తలనీలాలు, మొక్కులు తదితర వాటి ద్వారా ఆదాయం రూ. 23,50,333 వచ్చినట్లు పేర్కొన్నారు. మూడు రోజుల పాటు కొనసాగిన కల్యాణ మహోత్సవానికి భారీగా భక్తులతో పాటు వీవీఐపీలు, వీఐపీలు, ప్రజాప్రతినిధులు తరలిరావడంతో ఆదాయం వచ్చిందన్నారు.

కొమురవెల్లి మల్లికార్జున స్వామి

ప్రకృతిహితం.. ప్లాస్టిక్‌పై సమరం

- పర్యావరణ పరిరక్షణ.. ప్రతిఒక్కరి బాధ్యత
- ప్రజల మేలుకోరి.. జ్యూట్ వస్తువుల తయారీ
- అందరూ జ్యూట్ బ్యాగులు వాడాలని ప్రచారం
- హుస్నాబాద్‌లో ప్రత్యేకంగా దుకాణం ఏర్పాటు
- ఆదర్శంగా నిలుస్తున్న హుస్నాబాద్‌కు చెందిన మాతంగి ఉమారాణి

హుస్నాబాద్ టౌన్ : ఉమారాణి దుకాణంలో విక్రయిస్తున్న వివిధ రకాల జ్యూట్ బ్యాగులు

ఆహారం అనుకుని మూగజీవాలు ప్లాస్టిక్ కవర్లు తిని మృతి చెందిన ఘటనలను చూసి ఆమె చలించింది. ఎలాగైనా తన వంతుగా పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కృషి చేయాలని తలచింది. పర్యావరణానికి మేలు చేసే జ్యూట్ బ్యాగుల తయారీని ఎంచుకుని ఆదర్శంగా నిలుస్తున్నది హుస్నాబాద్‌కు చెందిన మాతంగి ఉమారాణి.

హుస్నాబాద్ టౌన్, జనవరి 9: కుటుంబానికి ఉన్న ఆర్థిక పరమైన ఇబ్బందులు తొలిగించుకునేందుకు ఏదో ఒక పని చేయాలని హుస్నాబాద్‌కు చెందిన మాతంగి ఉమారాణి నిర్ణయించుకుంది. కానీ, పదిమందికి మేలు చేయాలనే ఆలోచనకు శ్రీకారం చుట్టింది. ప్రజలకు ఉపయోగపడే విధంగా పర్యావరణానికి మేలు చేసే పనులు చేయాలని భావించి రెండేండ్లలో అనుకున్న పని చేసింది.

దుకాణంలో విక్రయిస్తున్న వివిధ రకాల జ్యూట్ బ్యాగులు

హుస్నాబాద్‌టౌన్: జ్యూట్‌తో తయారు చేసిన పలు రకాల బ్యాగులను చూపిస్తున్న ఉమారాణి

ప్లాస్టిక్ కవర్లతో జరిగే అనర్థాలు..

మార్కెట్‌లో మనం ఉపయోగించే ప్లాస్టిక్ కవర్ల వల్ల జరిగే అనర్థాలు గుర్తించకపోవడంతో పర్యావరణానికి తీవ్రమైన విఘాతం కలుగుతున్నది. ప్లాస్టిక్ కవర్లు బయట పారేస్తే అవి భూమిలో కలిసిపోయేందుకు సంవత్సరాలు పడుతుండడంతో దానివల్ల ఏర్పడుతున్న సమస్యలను గుర్తించింది. భూగర్భజలాలు ఇంకిపోకుండా ప్లాస్టిక్ కవర్లు అడ్డుగా ఉండడంతో పాటు మురుగు కాల్వల్లో చేరి పలురకాల వ్యాధులకు కారణమవుతున్న విషయాన్ని గమనించింది. ఎలాగైనా ప్లాస్టిక్‌ను నివారించాలనే పట్టుదలతో ముందుకు సాగింది.

రూ.1400తో వ్యాపారం ప్రారంభం

వరంగల్‌కు వెళ్లి జ్యూట్ వస్తువుల తయారీపై ఉమారాణి శిక్షణ తీసుకుంది. టైలరింగ్‌లో అనుభవం ఉండడంతో రూ.1400 పెట్టుబడితో జ్యూట్ వస్తువులు విక్రయించే వ్యాపారాన్ని హుస్నాబాద్‌లో ప్రారంభించింది. జ్యూట్‌తో ముందుగా మనీ పర్సులను తయారు చేసింది. ఈ విషయాన్ని తనకు తెలిసిన మహిళలకు చెప్పి కొనుగోలు చేయాలని, ఇవి పర్యావరణానికి మేలు చేస్తాయని వివరించినా మొదట్లో పెద్దగా స్పందన కనిపించలేదు. అయినా తయారీ చేయడం మాత్రం ఆమె ఆపలేదు. ప్రజలకు పర్యావరణ స్పృహ పెరగడం, ప్రభుత్వం సైతం ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నిషేధించడంతో జ్యూట్ వస్తువుల వినియోగం పెరిగింది.

26 రకాల జ్యూట్ బ్యాగుల తయారీ

26 రకాల జ్యూట్ బ్యాగులు, వస్తువులు తయారు చేస్తూ విక్రయిస్తున్నది. ప్రతి ఒక్కరూ నిత్యం ఉపయోగించే మనీ పర్సు, వాటర్ బాటిల్, టిఫిన్ బాక్స్, పూజా సామగ్రి, ఫ్రిజ్ కవర్లు, హ్యాండ్స్ బ్యాగ్స్, కూరగాయల బ్యాగ్స్, శారీస్, మొబైల్ పౌచ్ తదితర వస్తువులను వినియోగించుకునే విధంగా జ్యూట్ వస్తువులను తయారు చేస్తున్నది. రూ.80 నుంచి రూ.500 వరకు దొరికే వస్తువులను ఆమె తయారు చేస్తూ, విక్రయిస్తూ పర్యావరణానికి తనవంతు కృషి చేస్తున్నది.

సమాజాన్ని కాపాడుకోవాలి

సమాజం బాగుంటేనే మనం బాగుంటాం. సమాజం బాగుండాలంటే పర్యావరణం బాగుండాలే అనే ఆలోచన చేయాలి. ప్లాస్టిక్ కవర్లతో ఎదురవుతున్న ఇబ్బందులు తన మనస్సును తీవ్రంగా కలిచివేసింది. అందుకే మా ఇంట్లో ప్లాస్టిక్ వాడడం మానేశాం. భూమిలో కలిసిపోయే జనపనారతో తయారు చేసే జ్యూట్ బాగులను వినియోగించాలి. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలి.

– మాతంగి ఉమారాణి, హుస్నాబాద్

మంత్రి అసత్య ప్రచారం మానుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

హుస్నాబాద్, జనవరి 9: మంత్రి పొన్నం ప్రభాకర్ అసత్య ప్రచారం మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ హితవు పలికారు. కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తూ ఎలాంటి ఆధారాలు లేకుండా మాట్లాడడం మంత్రి హోదాకు మంచిదికాదన్నారు. మంగళవారం సాయంత్రం హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వినోద్‌కుమార్ అన్న కూతురు సరితారావు అనే మహిళకు జెన్‌కోలో ఏఈ ఉద్యోగం ఇప్పించారని ప్రచారం చేస్తున్నారని, అసలు వినోద్‌కుమార్‌కు అన్న అనే వ్యక్తి లేడని, సరితారావు అనే మహిళ వినోద్‌కుమార్‌కు బంధువే కాదన్నారు. మంత్రి హోదాలో ఉన్న పొన్నం నిజమేంటో తెలుసుకొని మాట్లాడాలన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు లేనిపోని హామీలు ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిచినట్లే కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా ఉన్న పొన్నం కడిగిన ముత్యంలాంటి వినోద్‌కుమార్‌పై అసత్య ప్రచారం చేసి పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తున్నాడని విమర్శించారు. మంత్రిగా ఉన్న పొన్నం ఇంకా ఎమ్మెల్యేలాగానే మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. నిజాలు తెలుసుకొని మాట్లాడాలని, లేకుంటే ప్రజలు చూస్తూ ఊరుకోరన్నారు. ఎన్నికలకు ముందు హుస్నాబాద్ నియోజకవర్గానికి మంజూరైన గిరిజన తండాల రోడ్ల నిర్మాణ నిధులు, సీడీపీ నిధులు, ఇతర అభివృద్ధి పనులకు మంజూరైన నిధులను మంత్రి పొన్నం రద్దు చేయించారని ఆరోపించారు. దీంతో చాలా అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, మంజూరైన నిధులను ఆయా పనులకు వినియోగించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై లఘుచిత్రం

రాఘవాపూర్‌లో చిత్రీకరిస్తున్న లఘుచిత్రంలోని ఓ దృశ్యం

సిద్దిపేట రూరల్, జనవరి 9: స్వచ్ఛ ఆరోగ్య తెలంగాణ నిర్మాణం దిశగా సాహస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఘన వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం, స్టీల్ బ్యాంక్‌ల వినియోగం వంటి అంశాలపై మండలంలోని రాఘవాపూర్‌లో లఘుచిత్రాన్ని చిత్రీకరించారు. గ్రామీణ ప్రజల జీవన విధానంలో మార్పు దిశగా చైతన్యం తేవాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని డైరెక్టర్ మహేశ్ తెలిపారు. ఈ చిత్రంలో చెత్తను వేరు చేయకపోవడం, ఎక్కడపడితే అక్కడ వేయడం, కాల్చివేయడం వల్ల అనేక అనర్థాలను చిత్రీకరించినట్లు తెలిపారు.కార్యక్రమంలో మేనేజర్ శేఖర్, ఫీల్డ్ ఆఫీసర్ దుర్గాప్రసాద్, నటీనటులు పరమేశ్వర్, రజిని, లలిత, లావణ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ బీమా ఉండాలి

- లీడ్ బ్యాంకు ప్రతినిధి సత్యజిత్

సిద్దిపేట, జనవరి 9: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రతి ఒక్కరికీ బీమా ఉండాలని లీడ్ బ్యాంకు ప్రతినిధి సత్యజిత్ అన్నారు. సిద్దిపేట పట్టణంలోని ప్రతిభ డిగ్రీ కాలేజీలో మంగళవారం బీమాపై ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాశ్చాత్య దేశాల్లో ప్రతి ఇక్కరూ బీమా తీసుకుంటారని తెలిపారు. దేశ జనాభాలో 20 శాతం మంది మాత్రమే బీమా కలిగి ఉండటం బాధాకరమన్నారు. ప్రతి ఒక్కరూ బీమా తీసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఇప్కోటోక్యో ప్రతినిధి రాజనర్సింహ, ప్రిన్సిపాల్ సూర్యప్రకాశ్, నిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్రిజేశ్, శరత్. జిలానీ, భాషా, రాజు, బాలకిషన్, వేణు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంకు ప్రతినిధి సత్యజిత్

నేడు హుస్నాబాద్‌కు మంత్రి పొన్నం

అధికారులతో సమీక్షా సమావేశం

హుస్నాబాద్, జనవరి 9: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం హుస్నాబాద్‌లో పర్యటించనున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు హుస్నాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆర్డీవో, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు హుస్నాబాద్ ఆర్టీసీ డిపోకు మంజూరైన రెండు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సులను ప్రారంభిస్తారు.

నేడు 'మాయని గాయాల నెత్తుటి చరిత్ర' పుస్తకావిష్కరణ

సీనియర్ జర్నలిస్టు మంగళారపు లక్ష్మణ్ రచించిన 'మాయని గాయాల నెత్తుటి చరిత్ర' అనే పుస్తకావిష్కరణ బుధవారం సాయంత్రం ఉంటుందని హుస్నాబాద్ డివిజన్ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పిట్టల తిరుపతి, చల్లా రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హుస్నాబాద్‌లోని తిరుమల గార్డెన్‌లో సాయంత్రం 4.30గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై పుస్తకావిష్కరణ చేస్తారని వారు పేర్కొన్నారు. మంత్రితో పాటు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, ఆచార్య ఘంటా చక్రపాణి, వి ప్రకాశ్, నారదాసు లక్ష్మణ్‌రావు తదితరులు హాజరవుతారని చెప్పారు. హుస్నాబాద్ ప్రాంతంలోని కవులు, కళాకారులు, మేధావులు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.